క్లుప్తంగా

సాయి మందిరంలో పంచాంగ శ్రవణం



ఉగాది ప్రసాదం అందజేస్తున్న అర్చకులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్ ఈబీ కాలనీలోని షిర్డీ సాయి ధ్యాన మందిరంలో మంగళవారం పంచాంగ శ్రవణం నిర్వహించారు. సాయిబాబాకు ప్రత్యేక పూజలు అనంతరం ఆలయ అర్చకులు రాశిఫలాలతో పంచాగ శ్రవణం చెప్పారు. ఉగాది పర్వదినం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో బాబాను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు విళ్లా సత్యనారాయణరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కమిటీ కోశాధికారి సుబ్బారావు, సభ్యులు రాజు, వెంకటేశ్వరరావు భూలోక్, కిశోర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులందరికీ ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.

16 నుంచి పెంటమాంబ తీర్థం



కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హిమాచల్ నగర్ గ్రామ దేవత పెంటమాంబ అమ్మవారి తీర్థం(పరస) ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నామని ఆలయ చైర్మన్ నమ్మి గౌరీశ్వరరావు తెలిపారు. ఈ మేరకు పెంటమాంబ అమ్మవారి ఆలయం వద్ద పరస కరపత్రాన్ని మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముగింపు రోజున పరస మహోత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్, సినీ నటుడు పొట్టిమూర్తి, ఆలయ ధర్మకర్త నమ్మి అచ్చియమ్మ, అధ్యక్షుడు షణ్ముఖ గురునాథరావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమి ముహూర్తపు రాట ఉత్సవం



ముహూర్తపు రాట వేస్తున్న భక్తులు

మల్కాపురం: ఈ నెల 17వ తేదీన శ్రీరామ నవమి సందర్భంగా ఉత్సవాలకు సంబంధించిన ముహూర్తపు రాటను మంగళవారం వేశారు.61వ వార్డు మల్కాపురం నగరాలవీధి లోని రామాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త భోగవల్లి నాగభూషణం దంపతులు రాట వేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 17న సీతా రాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించనున్నట్టు తెలిపారు. కల్యాణంలో 101 జంటలు పాల్గొంటాయని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు,రాముడి భక్తులు పాల్గొన్నారు.

బాల కళాకారులకు ప్రశంసా పత్రాలు



సర్టిఫికెట్లు అందుకున్న బాలబాలికలతో నిర్వాహకులు

స్టీల్‌ప్లాంట్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉగాది వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బాలబాలికల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం స్టీల్‌ప్లాంట్ సీజీఎం యు.శ్రీధర్ చేతుల మీదుగా వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అందరికీ చేరువగా.. ఉచిత వైద్యం

- పెద్ద ఎత్తున ఆస్పత్రుల అభివృద్ధి
- ఉచిత పరీక్షలు, వైద్యం, మందుల అందజేత
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



91వ వార్డు లక్ష్మీనగర్‌లో ఏర్పాటు చేసిన పట్టణ ఆరోగ్య కేంద్రం



గోపాలపట్నం కమ్యూనిటీ ఆస్పత్రి నూతన భవనం



89వ వార్డు కొత్తపాలెంలో నూతనంగా నిర్మించిన పట్టణ ఆరోగ్య కేంద్రం

గోపాలపట్నం : జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక అభివృద్ధి, సంక్షేమం వెల్లువెత్తుతోంది. ఆయన పాలనలో విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేశారు. ముఖ్యంగా పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం చేరువ చేశారు. దీంతో ప్రతి ప్రాంతంలోను ఆస్పత్రులు ఏర్పాటయ్యాయి. జగనన్న సురక్ష వంటి కార్యక్రమంతో నిరుపేదలకు నాణ్యమైన వైద్యం, మందులు అందిస్తున్నారు.

ప్రజల కోసం మరిన్ని ఆరోగ్య కేంద్రాలు..

జీవీఎంసీ 89, 90, 91, 92 వార్డుల్లో పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటయ్యాయి. గతంలో 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో ఒక ఆరోగ్య కేంద్రం, గోపాలపట్నంలో 30 పడకల ఆస్పత్రి మాత్రమే ఉండేవి. దీంతో ప్రజల ఆరోగ్య అవసరాలకు ఇవి సరిపోయేవి కాదు. ఇప్పుడు నూతనంగా 89వ వార్డులో రూ. 1.70 కోట్లతో ఆస్పత్రి నిర్మించారు. అలాగే 30 పడకల ఆస్పత్రిని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అభివృద్ధి చేసి రూ. 5.5 కోట్లతో నూతన భవనాలు నిర్మించారు. అత్యాధునిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. అదనంగా వైద్యుల్ని నియమించారు. 91వ వార్డులో పట్టణ ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడ పని చేసే డ్యూటీ డాక్టర్లతో పాటు వారంలో మూడు రోజులు స్పెషలిస్ట్ వైద్యులు వచ్చి సేవలందించేలా ఏర్పాటు చేశారు. దీంతో ఆయా ఆస్పత్రులు, వైద్యశాలలకు వచ్చే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

పెరిగిన రోగుల సంఖ్య..

ఇప్పుడు ఇక్కడికి రోజుకు 35 నుంచి 50 మంది వరకు పరీక్షలు, సేవల కోసం వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు గతంలో 200 మంది వరకు వచ్చేవారు. ఇప్పుడు సౌకర్యాలు మెరుగుపడి, స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులోకి రావడంతో ఆ సంఖ్య 250 నుంచి 300కు పెరిగినట్లు తెలిపారు.

ఆహ్లాదకరమైన వాతావరణం...

ఆస్పత్రిలో ఆహ్లాదకరమైన వాతారణం కల్పించేందుకు గోడలపై నూతనంగా పెయింటింగ్స్ వేయించారు. పిల్లలు ఆడుకునే ఆట వస్తువులు కూడా ఏర్పాటు చేయనున్నారు. దీని వల్ల ఆస్పత్రికి వచ్చే పిల్లల సంఖ్య పెరుగుతుందని వైద్యులు భావిస్తున్నారు. ఈ విధంగా ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తున్న సీఎం జగనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.



కొత్తపాలెం ఆస్పత్రిలో ల్యాబ్



ఓపీ వద్ద వేచి ఉన్న మహిళలు

ఘనంగా పందిరి రాట మహోత్సవం



గవరవీధి రామాలయం వద్ద కల్యాణ రాట వేసిన గౌరీ సేవా సంఘం సభ్యులు

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు గవరవీధి సీతారామచంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని పందిరిరాట మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉగాది పర్వదినం రోజున సీతారాముల కల్యాణ రాట వేయడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో గవరవీధి గౌరీ సేవా సంఘం సభ్యులు శాస్త్రోక్తంగా రాట ఉడుపు నిర్వహించారు. ఈ నెల17న కల్యాణం జరుగుతుందని అర్చకులు తెలిపారు. అనంతరం పంచాంగ శ్రవణం చేశారు.

నూకాలమ్మ ఆలయంలో పూజలు



పూజల్లో పాల్గొన్న పుర్రె సురేష్ తదితరులు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు పాత చెక్‌పోస్టు ఏరియా వద్ద కొలువుదీరిన నూకాలమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి ఆలయ అర్చకులు పసుపు,కుంకుమలతోఅభిషేకాలు చేపట్టారు.మందిరం చుట్టూ వేప,మామిడి తోరణాలను అలంకరించి పూజలు చేశారు.నెల రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ అర్చకులు తెలిపారు. మంగళవారం జరిగిన పూజల్లో ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, నర్సింగ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.

మల్కాపురం: తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలోని ఆలయాలు మంగళవారం భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక ఐవోసీ చింతామణి దుర్గాగణపతి ఆలయంలో కొలువుదీరిన దుర్గాగణపతి, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.

కేంద్ర ప్రభుత్వం దిగి రావాల్సిందే..



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకునేందుకు కార్మికులు పట్టు వదలక చేస్తున్న పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగి రాక తప్పదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగిస్తామనే ప్రకటన చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1153వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలువురు కార్మికులు కూర్చుని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఈ విధంగా ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముకుంటూ పోతే భారతదేశంలో ఏ ప్రభుత్వరంగ సంస్థా మిగలదన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు



గాయపడిన భారతి

ఎంవీపీ కాలనీ: వెంకోజీపాలెం కూడలిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చినగదిలి సంజయ్‌గాంధీ కాలనీకి చెందిన మామిడి భారతి(26) మంగళవారం సాయంత్రం హనుమంతవాక వైపు నుంచి వెంకోజీపాలెం వైపు ద్విచక్ర వాహనంపై వస్తోంది. ఈ క్రమంలో వెంకోజీపాలెం కూడలి వద్ద భారతి ఎంవీపీ కాలనీ వైపునకు మలుపు తిరుగుతుండగా బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి వేగంగా పక్క నుంచి దూసుకెళ్లిపోయాడు. దీంతో అదుపు తప్పిన భారతి వాహనంతో వెనక వస్తున్న ఒడిశా ఆర్టీసీ బస్సు చక్రాల కింద పడిపోయింది. దీంతో బస్సు ముందు చక్రాలు ఆమె కాలుపైకి ఎక్కేయడంతో కాలు నుజ్జయింది. దీంతో ట్రాఫిక్ పోలీసులు హుటాహుటిన ఆమెను చికిత్స నిమిత్తం మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. ఎంవీపీ పోలీసులు బస్సు డ్రైవర్, కండక్టర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీ దేవ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేషంగా పూజలు జరిగాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధికంగా తరలివచ్చి స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

ధ్యానమందిరంలో అన్నదాన వార్షికోత్సవం

తాటిచెట్లపాలెం: రైల్వేన్యూకాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో మంగళవారం 14వ అన్నదాన వార్షికోత్సవం, ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉగాది సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వహస్తాలతో సాయిబాబాకు వెయ్యి లీటర్ల పాలతో క్షీరాభిషేకం చేశారు. అనంతరం నవగ్రహారాధన, నవగ్రహ హోమం జరిగాయి. మధ్యాహ్న హారతి అనంతరం ధ్యానమందిరంలో అన్నదానం ప్రారంభించి 14ఏళ్లు పూర్తయిన సందర్భంగా సుమారు 500మందికి మహా అన్నదానం నిర్వహించారు. రాత్రి 7గంటల నుండి పంచాంగ శ్రవణం, బాబా గీతాలాపన నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఘనంగా పెద్దింటమ్మవారి పరస



పెద్దింటమ్మవారిని దర్శించుకున్న యలమంచిలి మున్సిపల్ చైర్మన్ పిల్లా రమాకుమారి

మల్కాపురం : జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురంలో కొలువుదీరిన పెద్దింటమ్మవారి పరస మంగళవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ప్రతి ఏటా ఉగాది పర్వదినాన ఇక్కడ పెద్దింటమ్మ పేరట స్థానికులు పరస నిర్వహించడం ఆనవాయితీ. దీనిలో భాగంగా ఈ ఏడాది కూడా పరస కనుల పండుగగా సాగింది. అమ్మవారిని యలమంచిలి మున్సిపల్ చైర్మన్ పిల్లా రమాకుమారి, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కన్వీనర్ భోగవల్లి నాగభూషణం, ఎం.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

సంగీత సమితి ప్రారంభం



సంగీత సంస్థను ప్రారంభిస్తున్న ప్రసాద్

సీతంపేట: ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి పేరిట నూతన సంగీత సంస్థ శంకరమఠంలో ప్రముఖుల సమక్షంలో ఘనంగా ప్రారంభమైంది. కళాభారతి కార్యదర్శి డాక్టర్ జి.ఆర్.కె.ప్రసాద్ జ్యోతిని వెలిగించి నూతన సంగీత సంస్థను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలో సంగీత జనకులం స్థాపించి తద్వారా శాస్త్రీయ సంగీత వైభవానికి స్వర్గీయ ఐవీఎల్ శాస్త్రి చేసిన మహోన్నత సేవలను కొనియాడారు. శంకరమఠం అధ్యక్షుడు డాక్టర్ టి.రవిరాజు, సంగీత కళాకారులు పి.గోపాలరావు, కె.సరస్వతి విద్యార్థి, వి.వి.రమణమూర్తి, డి.త్యాగరాజు, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, వి.వి.బి. శంకరం పాల్గొని ఐవీఎల్ శాస్త్రి సంగీత సేవలను కొనియాడారు. ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి గౌరవాధ్యక్షులు ఐ.రామచంద్రమూర్తి, అధ్యక్షుడు ఆకొండి వెంకటరావు, కార్యదర్శి పి.జగన్ మోహన్‌రావు, కోశాధికారి జి.మధుబాబు, సంగీత సంస్థ శిష్య బృందం పాల్గొన్నారు.

'వలంటీర్లకు క్షమాపణ చెప్పాలి'

మహారాణిపేట: నాలుగున్నరేళ్లుగా వలంటీర్లను నోటి కొచ్చినట్లు మాట్లాడిన చంద్రబాబు రూ. 5 వేల గౌరవ వేతనాన్ని రూ. 10 వేలకు పెంచుతానని బూటకపు ప్రకటనలు చేస్తే నమ్మడానికి వలంటీర్లు సిద్ధంగా లేరని జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు అన్నారు. వలంటీర్ల ద్వారా జరుగుతున్న పెన్షన్ పంపిణీని చంద్రబాబు అడ్డుకోవడం వల్ల ఆ పార్టీపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయన్నారు. వలంటీర్ వ్యవస్థను వ్యతిరేకిస్తే నామరూపాలు లేకుండా పోతామని అర్థమై యూటర్న్ తీసుకున్నారని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. వలంటీర్ల ఆత్మగౌరవం దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

స్వర్ణాభరణ అలంకరణలో కనకమహాలక్ష్మి



ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన సిరులతల్లి

డాబాగార్డెన్స్: క్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని మంగళవారం బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారిని స్వర్ణాభరణాలతో అలంకరించారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అమ్మ వారు స్వర్ణాభరణాలు, పట్టుచీరలో భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా గణపతి పూజ, మండపారాధన నిర్వహించిన అనంతరం ఎస్‌వీఎస్ఆర్‌కే ప్రసాద్ పంచాంగం చదివి వినిపించారు. అనంతరం భక్తులకు ఉగాది పచ్చడి, పంచాంగ పుస్తకాలు వితరణ చేశారు.

జోరుగా వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం



నేతాజీనగర్‌లో ప్రచారం చేస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: పశ్చిమ నియోజకవర్గంలో ఆడారి ఆనంద్ కుమార్ విజయం తథ్యమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మికి మంచి మెజారిటీ తీసుకువస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ మేరకు జీవీఎంసీ 91వ వార్డు నేతాజీ వీధిలో ఆయన మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేయాలని కోరారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమం ప్రతీ ఇంటికి చేరిందన్నారు. ఆడారి ఆనంద్ కుమార్ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రహదారులు, కాల్వలు బాగు చేశారని తెలిపారు. ప్రజలకు పలు విధాలుగా సాయం చేస్తూనే ఉన్నారన్నారు.

కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గుణిశెట్టి శ్రీనివాసరావు, 92వ వార్డు గొర్లె అప్పలస్వామి నాయుడు, కన్వీనర్లు, గృహసారథులు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు



ఎండ వేడికి చెట్టు కింద సేదదీరుతున్న పాదచారులు



ఎండ వేడికి రక్షణగా చీర చెంగు కప్పుకున్న చిరు వ్యాపారి

విలవిల్లాడుతున్న ప్రజలు

మల్కాపురం : మే నెల రాక ముందే ఎండలు మండిపోతున్నాయి. వేడితో పాటు వడగాడ్పులు ఎక్కువవడంతో పాదచారులు, వాహన చోదకులు ఇంటి నుండి బయటికి రావడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. పారిశ్రామిక ప్రాంతంలో వారం రోజుల నుండి ఎండలు తీవ్రస్థాయిలో ఉన్నాయి. ఉదయం ఆరు గంటలకే ఎండ విశ్వరూపం చూపిస్తుండటంతో ప్రజలు కలవరపడుతున్నారు. మంగళవారం కూడా ఎండ తీవ్రస్థాయిలో ఉంది. దీనికి తోడు వడగాడ్పులు కూడా ఎక్కువ కావడంతో అంతా గొడుగులను ఆశ్రయిస్తున్నారు. చెట్టు నీడన చేరి సేద దీరుతున్నారు. తీవ్రమైన ఎండలతో చిరు వ్యాపారాలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

నవ్వులు కురిపించిన 'చల్ చల్ గుర్రం'



మాట్లాడుతున్న సినీ నటుడు ఎస్.కె.మిశ్రో

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వాకర్స్ పార్కు ఆవరణలో మంగళవారం సాయంత్రం ఉగాది వేడుకలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. సుసరావు చంద్రశేఖ శర్మ పంచాంగ శ్రవణం నిర్వహించారు.

అనంతరం విశాఖ సాయి స్నేహ క్రియేషన్స్ ఆధ్వర్యంలో ప్రముఖ రంగస్థల, సినీ నటుడు ఎస్.కె.మిశ్రో, మిశ్రో ప్రియశిష్యుడు ప్రముఖ రంగస్థల, సినీ నటుడు మాచిరాజు నారాయణరావును వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి చేతుల మీదుగా సత్కరించారు. మాచిరాజు నారాయణ రావు సమర్పణలో ప్రముఖ నటులు ఎస్.వి.ఎల్.ఎన్ ప్రసాద్ 'మిమిక్రి', ఆకట్టుకుంది. ఎస్.వి.ఎల్.ఎన్ ప్రసాద్ దర్శకత్వంలో ప్రదర్శించిన ప్రముఖ రచయిత, ప్రఖ్యాత సినీ నటుడు తనికెళ్ళ భరణి రచించిన చల్‌చల్ గుర్రం హాస్య నాటిక నవ్వులు కురిపించింది. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పి.చెల్వరాజు, వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు కార్యదర్శి ఆర్.సత్యనాథం, 101 ఎలెక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్, పూర్వ అధ్యక్షులు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నృసింహుడికి విశేష పూజలు



నిత్యకల్యాణంలో తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: ఉగాది పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం 1001నామాలను పఠిస్తూ స్వామికి అర్చన చేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో గరుడవాహనంపై గోవిందరాజస్వామిని అధిష్టంపజేసి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. అర్చకుడు కుమారాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా పోలిపిల్లిమ్మ మారువారం పండగ



పోలిపిల్లిమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు అప్పన్నపాలెంలో వేంచేసిన పోలిపిల్లిమ్మ మారువారం పండగ మంగళవారం ఘనంగా జరిగింది. మహిళలు, భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పసుపుకుంకుమలు సమర్పించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. అప్పన్నపాలెం, సింహపురికాలనీ, సింహపురిలేఅవుట్, పంచాయతీకాలనీ, వాంబే కాలనీ తదితర ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ 98వవార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, నాయకులు పీతల అప్పలరాజు, జగదీష్, కె.సింహాద్రి,నక్క శ్రీను,సింహాచలం తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పీతల విష్ణుమూర్తి ఏర్పాట్లు పర్యవేక్షించారు.